క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని కాపాడండి



కలెక్టర్ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సుమన్ గౌడ్

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామం 99/1 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుర్జని సుమన్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తొలుత కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల విలువ చేసే సర్కారు భూమిని కొందరు ఆక్రమించి, అక్రమ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఇదే విషయమై.. పలుమార్లు బాలాపూర్ తహసీల్దార్‌కు విన్నవించామని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆ స్థలాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుదీర్, మల్లేశ్, ధన్‌రాజ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛట్‌పూజ



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలో యూపీ, బీహార్ రాష్ట్రాలకు చెందిన ప్రజలు గురువారం ఛట్‌పూజ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉందాసాగర్‌లో చెరువులో గంగాదేవి, సూర్య భగవాన్‌లకు పూజలు చేసి, దీక్షలు పూనారు. శుక్రవారం దీక్షలు విరమించనున్నారు. వేడుకలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నాయకులు షేర్ సింగ్, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానించిన బీఆర్‌ఎస్ నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.వెంకట్రామ్‌ను బీఆర్‌ఎస్ నాయకులు మన్సూర్ అలీ, బర్కత్ అలీ, ఆరీఫ్‌లు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి.. సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను కోరారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రం బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, తారామతిపేట గ్రామానికి చెందిన అచ్చిని శ్రీశైలం ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సంఘం తరఫున మృతుడి కుటుంబానికి అందజేసే రూ.25వేల ఆర్థిక సహాయాన్ని గురువారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్.. సంఘం కార్యాలయంలో మృతుడి భార్య సుక్కమ్మకు అందజేశారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



తరుణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న శ్రీరామ్‌యాదవ్

ఇబ్రహీంపట్నం రూరల్: యాదవ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా మండల పరిధి పోచారం గ్రామానికి చెందిన దాయి తరుణ్‌తేజ్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు శ్రీరామ్‌యాదవ్.. తరుణ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. యాదవుల సంక్షేమం, అభివృద్ధికోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ బాధ్యతను అప్పగించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

జోరందుకున్న సమగ్రసర్వే

సమగ్ర కుటుంబ సర్వే జోరుగా సాగుతోంది. రెండోరోజు ఎన్యుమరేటర్లు ఇళ్లకు స్టిక్కర్లు వేయగా.. తహసీల్దార్లు, ఎంపీడీఓలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కులగణను పారదర్శకంగా నిర్వహించాలని, కేటాయించిన ఇళ్లకు వెళ్లి, కుటుంబ వివరాలు సేకరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజలు సర్వే అధికారులకు సహకరించి, అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని కోరారు.



మహేశ్వరం: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

రెండోరోజు ఇళ్లకు స్టిక్కర్లు

- పర్యవేక్షించిన అధికారులు
- నేడు కొనసాగింపు
- రేపటి నుంచి కులగణన
- సర్వేపై ఎలాంటి అపోహలు వద్దు: మహేశ్వరం ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే)కు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, ఎన్యుమరేటర్లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని ఎంపీడీఓ శైలజ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఇళ్లకు స్టిక్కర్లు వేసే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సర్వేకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ఎన్యుమరేటర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

కందుకూరులో..

కందుకూరు: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి కొత్తూర్, లేమూరు, సరస్వతిగూడ గ్రామాల్లో చేపట్టిన స్టిక్కరింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సర్వే సమయంలో సేకరించిన అంశాలను సక్రమంగా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. శుక్రవారం వరకు స్టిక్కర్లు వేసే కార్యక్రమం పూర్తి చేయాలని, శనివారం నుంచి సర్వే చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ గీత ఉన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా రెండోరోజు ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన నివాసాలకు వెళ్లి, స్టిక్కర్లు వేశారు. కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నామని తహసీల్దార్ సునీత రెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల పరిధి తుర్కగూడలో ఇంటింటి స్టిక్కర్లు అతికించే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కులగణను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఇప్పటి వరకు 70శాతం స్టిక్కర్లు వేశామని, ప్రక్రియ శుక్రవారంతో ముగుస్తుందని వెల్లడించారు. శనివారం నుంచి ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి, సమగ్ర సమాచారం సేకరించి, ఫార్మట్‌లో పొందుపరుస్తారని తెలిపారు. ప్రతి బ్లాక్‌లో 150 నివాసాలు ఉంటాయని, పది బ్లాక్‌లను ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షిస్తారని వివరించారు. ప్రజలు.. సర్వే అధికారులకు సహకరించాలని కోరారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణ ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నామని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. మండల పరిధి పడకల్, దేవుని పడకల్, జంగారెడ్డి పల్లి, పెద్దూర్‌తండా, హర్యానాయక్‌తండా తదితర గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీకాంత్ పర్యటించారు. స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. వేయని ఇళ్లకు వేయించారు.

పకడ్బందీగా..

ఆమనగల్లు: కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ స్టిక్కర్లు వేస్తుండగా.. అధికారులు పర్యవేక్షించారు. మండల పరిధి కోనాపూర్‌లో ప్రక్రియను ఎంపీడీఓ పరిశీలించగా.. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ వసంత పర్యవేక్షించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అలీం, శ్రీకాంత్, మహేశ్, నాజర్, జిల్లా ఎన్‌ఎస్‌యుఐ కార్యదర్శి ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



స్టిక్కర్ వేస్తున్న ఎన్యుమరేటర్

టీచర్లకు సహకరించండి

ఇబ్రహీంపట్నం: సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లుగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులకు అన్ని విధాల సహకరించాలని ఎంపీడీఓ వెంకటమ్మను పీఆర్టీయూ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఈ ప్రక్రియలో టీచర్లకు ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని నేతలు పరమేష్, ఆనంద్ కుమార్ పేర్కొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు



తుక్కుగూడ: ఇళ్లకు స్టిక్కర్లు వేస్తున్న ఎన్యుమరేటర్లు



ఇబ్రహీంపట్నం: తుర్కగూడలో స్టిక్కర్లు వేస్తున్న ఎన్యుమరేటర్లు



కందుకూరు: కొత్తూరులో ఎన్యుమరేట్లతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

దేవాలయాల పరిరక్షణకు కృషిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న బాబయ్య, అనంతయ్య

షాద్‌నగర్‌రూరల్: పురాతన దేవాలయాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ కానుగు అనంతయ్య రూ.25వేల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని బాబయ్య చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న పురాతన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకొని భగవన్నామ స్మరణ చేయాలని సూచించారు. సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, పిల్లి యాదయ్య, నరహరి, శేఖర్, జీటీ.మోహన్, అందె రఘు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్: పట్టణంలోని జానంపేటలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 20న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలకు పట్టణ ప్రజలు, భక్తులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జమ్మద్‌ఖాన్, గంధం ఆనంద్, వీరేశం, శివయ్య, బీరప్ప, శ్రీశైలం, పల్లి శేఖర్, వీరేశం, సంపత్, మహేందర్, శివరాజ్, గోపాల్, రవి కుమార్, వెంకటేశ్, సాయి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారు.. మొర ఆలకించండి



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేంత వరకు దీక్ష విరమించమని జేఏసీ కన్వీనర్ అశోక్ గౌడ్ అన్నారు. మండల కేంద్రం ఏర్పాటు చేయాలంటూ చేపట్టిన దీక్ష గురువారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో రెండు పర్యాయాలు దీక్ష చేపట్టామని, ప్రస్తుతం పోరాడుతూనే ఉన్నామని పేర్కొన్నారు. అయినా ప్రజల ఆకాంక్షను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే గారన్నా.. మా మొర ఆలకించి, మండల కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ శరత్ చంద్ర, నర్సింహ, అనిల్, ఆంజనేయులు, చెన్నయ్య, వెంకటేశ్, మాణిక్య రెడ్డి, శేషు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లయన్స్ ఆధ్వర్యంలో ప్రజాసేవ

లయన్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి



ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. లయన్ తెలంగాణ ఏరియా లీడర్ నరేందర్‌రెడ్డి సూచన మేరకు.. పట్టణంలో లయన్స్‌క్లబ్, కాంగ్రెస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం, ఉచిత కంటి వైద్యశిబిరం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

కేశంపేట: షెడ్యూల్ తెగల ఉపప్రణాళిక పథకంలో భాగంగా మండల పరిధి గుట్టలగడ్డతండా రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మొక్కజొన్న సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగు పద్ధతులను వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా విత్తన ప్యాకెట్లతో పాటు కలుపు మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్ఎల్ జూట్, డాక్టర్ నగేశ్‌కుమార్, సునీల్, మల్లయ్య, లక్ష్మి, సౌజన్య, వాణి, పరమేశ్వరి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యువత శ్రమదానం

తలకొండపల్లి: మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో ఆర్ఎస్ఎస్ శివాజీ శాఖ ఆధ్వర్యంలో యువకులు సేవాదిన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. వెంకట్రావ్‌పేట్- గట్టుఇప్పలపల్లి రహదారి మార్గంలో చెట్లు ఏపుగా పెరిగి, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో.. యువకులు ముందుకు వచ్చారు. పలుగు, పార పట్టి.. శ్రమదానం చేశారు. చెట్లకొమ్మలను తొలగించారు. పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేశారు. భాస్కర్, సాయిరాం, శరత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా



అయ్యప్ప భక్తులకు భిక్ష వడ్డిస్తున్న వెంకటేశ్ గుప్తా తదితరులు

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ డైరెక్టర్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. మండల కేంద్రం శివాలయంలో ట్రస్టు ఆధ్వర్యంలో, అయ్యప్ప మాలధారణ భక్తులకు నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని కేరళకు చెందిన గురుస్వామి చంద్రమోహన్ నాయర్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా దీక్ష చేపట్టిన భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాద(భిక్ష) కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఏటా 60 రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు. గురుస్వామి నాయర్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మాలధారణ భక్తులకు ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. భక్తులు ఆలపించిన భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. కార్యక్రమంలో గురుస్వాములు అశోక్, ధన్‌రాజ్, భీముడు, సైదులు, బిక్కు, రాజు, శ్రీశైలం, మల్లేశ్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



నూతన సభ్యులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: బాలాజీ తాపీ మేస్త్రీ నూతన కార్యవర్గాన్ని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం మండల కేంద్రంలో సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షుడు మహేశ్, కార్యవర్గ సభ్యులు జంగయ్య, మల్లేశ్, రాములు, నర్సింహ, కృష్ణలను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘం సభ్యుల కోరిక మేరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు మల్లేశ్‌గౌడ్, మంకి శ్రీను, రమేశ్, రేణుకుమార్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు

కొందుర్గు: పదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్న అంజయ్యయాదవ్ జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చేసిన అభివృద్ధి ఏమిటో తెలపాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి రాజు ప్రశ్నించారు. గురువారం చౌదరిగూడలో ఆయన మాట్లాడారు. పేరుకే చౌదరిగూడ మండలం చేశారే తప్పా.. ఒక్క ప్రభుత్వ భవనం నిర్మించింది లేదన్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారినా.. పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రేషన్‌కార్డులే ఇంకా ఉండటం సిగ్గుచేటన్నారు. సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వలేదన్న సంగంతి బీఆర్‌ఎస్ నాయకులకు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు బిల్లులు రాలేదని చెప్పడం బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు ఆంజనేయులు, సలీం, వెంకటనర్సింహారెడ్డి, ఎజాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు, నాయకులు

అప్పుచేసి భోజనం వడ్డించాం

- అయినా పది నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు
- జీతాలు పెంచుతామని మాటతప్పారు
- మధ్యాహ్న భోజన కార్మికులు



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

తలకొండపల్లి: 'అప్పు చేసి పిల్లలకు భోజనం వడ్డిస్తున్నాం. అయినా పది నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి' అని మధ్యాహ్న భోజన రాష్ట్ర అధ్యక్షురాలు వై.స్వప్న డిమాండ్ చేశారు. బిల్లు రాకుంటే చేసిన అప్పులు ఎలా తీర్చాలి, కార్మికుల జీవనం ఎలా కొనసాగుతుందని ఆమె ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ.. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జిల్లెల పెంటయ్య ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడారు. ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే భోజన కార్మికులు నెలసరి వేతనం రూ.3 వేల నుంచి 10 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తి కావస్తున్నా నేటికీ పెంచలేదని విమర్శించారు. ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలుపుకోవాలని కోరారు. 9,10 తరగతులకు సంబంధించి 10 నెలలుగా బిల్లులు రాలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, మధ్యాహ్న భోజన మండల ప్రధాన కార్యదర్శి రమాదేవి, మంజుల, లక్ష్మమ్మ, అంజమ్మ, నాగమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

అవసరమైన పనులు ఎంపిక చేయండి

కొందుర్గు: ఉపాధిహామీ పథకంలో అవసరమైన పనులను ఎంపిక చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులకు సంబంధించి భూముల చదును, వాలుకట్టలు, ఫారమ్‌ఫండ్, రైతుల పంట పొలాలకు వెళ్లడానికి దారుల ఏర్పాటు వంటి పనుల కోసం గ్రామస్తులందరూ కలిసి చర్చించి తీర్మానం చేయాలని సూచించారు. ప్రజల అవసరాలు తీరడంతో పాటు కూలీలకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈసీ లక్ష్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.